# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి




సుబ్బడు రోజూ తాగవలసిందే.

పొద్దున్నే లేచి ముఖం కడుక్కోటం ఎంత సహజమో, రాత్రికి కల్లు తాగటం అంత సహజం. కూటి మాట దేవుడెరుగు. చుక్కలు ఆకాశం మీదకొచ్చే సరికి కడుపులో చుక్క పడకపోతే ఆకాశం తిరిగి పడిపోయినట్టుంటుంది సుబ్బడికి. ఫ్యాక్టరీలో రూపాయి న్నర కూలి చేతిలో పడగానే అందులో రూపాయి బిళ్ళ ఎగిరి గంతులేస్తూ వుంటుంది కల్లు దుకాణం గల్లాలోకి పరుగెట్టడానికి. అంగలంగలుగా వెళ్ళిపోతాడు వూరి బయట దుకాణానికి. కల్లు దుకాణం యజమాని వీరాస్వామి గుడిసెలో దూరేవాడి ముఖం చూసి చెప్పేయగలడు. వాడి దగ్గర మస్తుగా డబ్బుందో లేదో! డబ్బున్నవాడు కల్లు పాకలోకి దూరికూర్చుని 'ఒరేయ్'! అనటంలో ఓ ధీమా వుంటుంది. అంతంత మాత్రం గాడు అడుగు ఘనంగా వేయలేదు. ముంత తెమ్మని దబాయించలేదు. ఆ రోజు సుబ్బడు బహు హుందాగా గుడిసెలో దూరాడు. చెక్క బల్లమీద కూర్చోగానే ఛింకి తువ్వాలు ఛెళ్ళున ఝాడించాడు. అలా ఝాడించిన తువ్వాలు వుండచుట్టి కాలుకింద పెట్టుకుని 'ఒరేయ్'! అని కేకేశాడు. ఆ కేక లక్షాధికారి పదిమంది నౌకర్లని పిలిచినట్టుంది. ఆ కేకలోని వూపు చూసి వీరాస్వామి సైగ అందుకుని, కుర్రాడు ముంతనిండా కల్లు తెచ్చి ముందు పెట్టాడు. సుబ్బడు ఆ ముంతని ప్రేమగా చూశాడు. మళ్ళీ మళ్ళీ చూశాడు. ఇన్ని రూపాయిలు నీకిచ్చేస్తున్నానే! కడుపుకు తినటం లేదు. కట్టుకున్న పెళ్ళానికి పెట్టటం లేదు. కన్నోళ్ళకి కానీ ఇయ్యటం లేదు. నీకే! నీకే! ఎన్ని రూపాయిలిచ్చాను. నా కష్టమంతా నీకే దారపోత్తన్నానే, నువ్వునన్నిడిసి పెట్టవు, నేను నిన్నిడిసి పెట్టను. పట్టు! ఇది జల్మబందం అనుకుంటూ ముంతెత్తి గట గట తాగేశాడు.

ఓ నిముషమాగి సుబ్బడు 'ఓ. ఒరేయ్!' అన్నాడు. మళ్ళీ వీరాస్వామి కనుసైగతో కుర్రాడు ముంత నింపాడు. రెండో ముంత చూస్తూ సుబ్బడు కలలు గంటం మొదలెట్టాడు. రోజుకి రూపాయిన్నర సంపాదిస్తే అర్ధ రూపాయి ఇంటికెళ్తోంది. తనెప్పటికైనా డబ్బు సంపాదిస్తాడు. డబ్బెక్కణ్ణించి వస్తది? దూరపు సుట్టం ముసలమ్మెవరో సస్తది? డబ్బున్న సుట్టం ముసలమ్మ ఎవరూ లేరే...వుంటది...ఎక్కడో వుంటది...ముందుగా తెలవదు...తెలిస్తే ఇప్పుడే ఎళ్ళి సంపుదును గదా! ఆ ముసల్ది ఎంకమ్మ...దాని దగ్గర బంగారం వుంది...డబ్బుంది...పొలం వుంది. అది సావంగానే బోల్డంత డబ్బు...పెళ్ళానికి సీరలు...తనింట్లోనే కల్లు బానలు...వోహ్...ముంత ఖాళీ చేశాడు.

కల్లు కళ్ళల్లో కొచ్చింది.

తలకాయ తాళం వేస్తోంది.

మాట నాలిక దాటి రావడం లేదు.

'వో' అన్నట్టు ఖాళీ ముంత వూపాడు సుబ్బడు.

ఈ తడవ వీరాస్వామి సైగ వెయ్యలేదు. కుర్రాడు కల్లు పొయ్యలేదు. రూపాయి మించి సుబ్బడి దగ్గర వుంటానికి వీల్లేదు. అంచేత మాడనట్టువూరుకున్నాడు వీరాస్వామి. సుబ్బడికి ఆ రోజున పండగ ఈనాము కింద రెండు రోజుల కూలి ఇచ్చారు. సుబ్బడిక వుండ బట్టలేక వీరాస్వామి దగ్గర కెళ్ళి "ఏటి నా దగ్గర డబ్బు లేదనా...ఇదో రెండ్రూపాయిలు ఏటనుకుంటున్నావో...నాకు ఆస్తొస్తది...ముసలెంకమ్మ సస్తది... బోల్డంత పొలం...డబ్బు...నాకేం లోటులేదు..." అంటూ వూగిపోతున్నాడు. "ఎప్పుడు సస్తది ముసల్ది" అన్నాడు వీరాస్వామి.

"రేపో...ఎల్లుండో...రేపే సస్తది. రేపు బాన తాగేత్తాను" అంటూ మరో రెండు ముంతలు గటగట తాగేశాడు. వీధిన తట్టుకుంటూ, రాళ్ళు తన్నుకుంటూ గుడిసెకొచ్చి పడ్డాడు. పెళ్ళాన్ని గంజి తెమ్మని అరిచాడు. ఉప్పు తక్కువన్నాడు. ఉల్లిపాయ కారం లేదన్నాడు. విసుక్కున్నాడు. తిట్టుకున్నాడు. తిన్నంత తిని ఎల్లకితలా పడుకున్నాడు.

పొద్దున లేస్తే సుబ్బడికి ఏదిటోగా వుంది. వేపుల్లతో పళ్ళు తోమి ఫ్యాక్టరీకి పోతుంటే ఉదయపు ఎండ కాలిపోతున్నట్టుంది. ఎద్దులు ఆవుల్లా కన్పిస్తున్నాయి. చల్లగాలి చికాగ్గా వుంది. కాళ్ళూ చేతులూ తనవి లాగా తోచడం లేదు. కాళ్ళు నడుస్తున్నాయిగాని నడక నిటారుగా లేదు. అలాగే వెళ్ళి పని చేశాడు.

సాయంత్రం సుబ్బడికి కూలివ్వలేదు. పండగ ఈనాముకింద కూలి జమచేశారు. కల్లు లేదనేసరికి కడుపు చెరువయిపోయింది. అందరి దగ్గర అప్పడిగాడు. దొరకలేదు. ఏడుపొస్తోంది. చుక్కల్ని, ఆకాశాన్ని తెగ తిట్టాడు. ముసలమ్మ చావలేదు. ఆస్తి రాలేదు. నరాలు పీకుతున్నాయి. గుండెల్లో దిగులు. కాళ్ళలో నిస్సత్తువ... కళ్ళలో కోపం...వీరాస్వామిని బతిమిలాడాడు. అప్పు దొరకలేదు.

కసిగా వీధిలోని రాళ్ళని తంతూ ఇంటికొచ్చాడు. పెళ్ళాన్ని పిల్లల్ని తిట్టాడు. గంజి తాగి పండుకుంటే కలత నిద్రలో కల...కలలో ముసలమ్మ. ముసలమ్మ దేవతైంది. రెండు చేతుల్లో రెండు పాత్రలు. ఒక పాత్రలో పచ్చ కర్పూరం వేసిన చిక్కటి పాలు, రెండో పాత్రలో కల్లు. 'ఏది కావాలో తీసుకో' మంది. కల్లు తీసుకుని కడుపారా తాగాడు...ఆ తర్వాత పెద్ద బల్లెంతో రాక్షసుడు వాడితో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో రాక్షసుడు బల్లెంతో గుండెలో పొడిస్తే కెవ్వున అరిచి నిద్ర లేచాడు.

తెల్లవారింది.

అంట్లు తోముతున్న పెళ్ళాం కనిపించింది. ఆడుకుంటున్న పిల్లలు ముద్దొచ్చారు. చల్లగాలి హాయిగా వుంది. పువ్వులు ఎండకి మెరుస్తున్నాయి. "ఇట్టగెప్పుడూ లేదే," అని అబ్బుర పడ్డాడు సుబ్బడు.

రాత్రి కలలో పచ్చ కర్పూరం పాలు తాగక పోతినే అని బాధపడ్డాడు.

ముత్యాల ముగ్గు